ప్రజాశక్తి
మంగళవారం 30 డిసెంబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అరెస్ట్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : కిసాన్‌సెజ్‌లో మంగళవారం జరగనున్న ఇథనాల్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణ నిలుపుదల చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కొడవలూరు మండలం, రేగడచెలిక వద్ద సోమవారం రాత్రి పోలీసులు అయనను అడ్డుకున్నారు. ప్రచారం నిర్వహిం చొద్దని, ఇక్కడకు ఎందుకు వచ్చారని పోలీసులు వాదనకు దిగారు. నెల్లూరు రూరల్ డిఎస్‌పి శ్రీనివాసరావు ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని కోరారు. ఇంతలో నెల్లూరు రెండవ నగర పోలీసులు రమేష్‌కు నోటీసులు ఇవ్వాలని చూశారు. తాను ఎందుకు తీసుకోవాలని, ఏం తప్పుచేశానని ప్రశ్నించారు. నోటీసులు తీసు కోకపోతే అరెస్ట్ చేయాల్సి ఉంటుం దని ఆయనను జీపు ఎక్కించారు. అక్కడ నుంచి నెల్లూరు రెండో నగర పోలీసు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సిపిఎం నేతలు కార్యకర్తలు పెద్దఎత్తున పోలీస్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలీస్ చర్యలను ఖండించారు. అనంతరం రాత్రి 9.30 గంటల సమయంలో సొంత పూచీకత్తుపై మూలం రమేష్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మూలం రమేష్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నెల్లూరు జిల్లాలో ఆరు మండలాలు..!

-వాకాడు, చిట్టమూరు తిరుపతిలోనే..
-రాష్ట్ర కేబినెట్ ఆమోదం
-31న గెజిట్ విడుదల

నెల్లూరు జిల్లాలోనే గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాలు.. రాపూరు, కలువాయి. సైదాపురం మండలాలు కొన సాగనున్నాయి. ఈ మేరకు సోమవారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. గూడూరు నియోజకవర్గంలోని వాకాడు, చిట్టమూరు మండలాలను తిరుపతి జిల్లాలోనే ఉంచాలని నిర్ణయం తీసుకున్నారు....ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు పలుమార్లు మంత్రులు, ఉన్నతాధికారులతో చర్చించిన తరువాత క్యాబినెట్‌లోకి తీసుకెళ్లారు.. రాష్ట్ర వ్యాపితంగా 927 అభ్యంతరాలు వచ్చాయి. . ఈనెల 31న తుది నోటిఫికేషన్ గెజెట్ విడుదల చేయనున్నారు.

కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ప్రజా పోరాటం ఫలించింది. గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాలు గూడూరు, చిల్లకూరు,. కోట మండలాలను నెల్లూరు జిల్లాలో కలపాలని,వాకాడు, చిట్టమూరు మండలాలను తిరుపతిలోనే ఉంచాలని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్యక్షతన జరిగిన రాష్ట్ర క్యాబినెట్ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. నెల్లూరు జల్లాలో గూడూరు నియోజకవర్గాన్ని కలపాలని నెల రోజులుగా గూడూరు కేంద్రంగా పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించారు. ఆపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రభుత్వానికి లేఖ రాశారు. స్థానిక ఎంఎల్‌ఎ పాశం సునీల్‌కుమార్ తన పదవికి రాజీనామా చేస్తానని తేల్చిచెప్పారు. వైసిపి నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం, ఆదివారం ముఖ్యమంత్రి జిఆర్‌డి, రెవెన్యూ, అధికారులు, మంత్రులతో ప్రత్యేకంగా బేటి అయ్యారు. తరువాత వచ్చిన కొన్ని అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకున్నట్లు తెలిసింది.. జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజన ప్రాథమిక నోటిఫికేషన్‌పై వ్యక్తమైన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. . గత నెల 27న జిల్లాల పునర్విభజనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 27కి అభ్యంతరాల గడువు ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 927 అభ్యంతరాలు, సూచనలు రాగా...సుదర్ఘీంగా చర్చించి క్యాబినెట్ ముందు ఉంచారు.

నెల్లూరులో ఆరు మండలాలు..!

గూడూరు ప్రజల, నాయకుల అభిప్రాయం మేరకు గూడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే కలపాలని ముఖ్యమంత్రి శనివారం అధికారులకు స్పష్టం చేశారు. ఆదివారం మరోసారి ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమై య్యారు. సోమవారం ఉదయం జరిగిన రాష్ట్ర క్యాబినెట్‌లో గూడూరు, చిల్లకూరు, కోట మండలాలు నెల్లూరు జిల్లాలోని కలపాలని నిర్ణయం తీసుకున్నారు. వాకాడు, చిట్టమూరు మండలాలను తిరుపతి జిల్లాలోనే కొనసాగించనున్నారు. వాకాడు మండలంలోని దుగరాజు పట్నం పోర్టు విషయంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. రాయలసీమ జిల్లాకు ఒక పోర్టు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కలు వాయి, రాపూరు , సైదాపురం కూడా నెల్లూరులోనే ఉంచాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రాథమిక నోటిఫికేషన్‌లో భాగంగా కందుకూరు డివిజన్‌లోని 5 మండలాలను ప్రకాశం జిల్లాకు మార్చడంతో పాటు... కందు కూరు డివిజన్‌లోని మిగిలిన రెండు మండ లాలు వరికుం టపాడు, కొండాపురం మండ లాలను కావలి డివిజన్‌లోకి మార్చుచేశారు. ఈనెల 31న తుది నోటిఫికేషన్, గెజట్ విడుదల చేయలనున్నారు.

గుడ్డిలో మెల్ల..నేతల సంబరాలు..!

గూడూరు నియోజవర్గాన్ని నెల్లూరులో కలుపుతామని చంద్రబాబు నాయుడు, లోకేష్ హామీ ఇచ్చినా, కొన్ని రాజకీయ కారణాలతో గూడూరును తిరుపతి జిల్లాలోనే ఉంచాలని తొలిత నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులతోపాటు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పోరాటం చేశారు.సోమవారం జరిగిన క్యాబినెట్‌లో గూడూరులోని కేవలం మూడు మండలాలను మాత్రమే నెల్లూరులో కలపనున్నారు. ఈ నిర్ణయం పట్ల కొంత అసంతృప్తిగా ఉన్నప్పటికీ గుడ్డిలో మెల్లలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. గూడూరు ఎంఎల్‌ఎ పాశం సునీల్‌కుమార్ నారా చంద్రబాబు, లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నేడు సంబరాలు చేసు కోనున్నారు. ఉన్నంతలో ప్రజా పోరాటానికి ప్రభుత్వం తలొగ్గిందన్నారు. సీనియర్ నేత, పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాభిప్రాయం చెప్పకుండా..

పోలీసుల అత్యుత్సాహం..!

కిసాన్ సెజ్‌లో ఇథనాల్ పరిశ్రమల వల్ల ప్రమాదకర కాలుష్యం వస్తుందని , ఇథనాల్ పరిశ్రమ మాకొద్దు అంటూ ప్రజలను చైతన్యం చేస్తున్న సిపిఎం నేతలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. నేడు కొడవలూరులోని కిసాన్‌సెజ్‌లో ఇథనాల్ ప్రాజెక్టు కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఈ విషయంలో సిపిఎం వ్యతిరేకిస్తుంది. ప్రజలను చైతన్యం చేస్తుండడంతో ప్రజాభిప్రాయం చెప్పకుండా నేతల గొంతు నొక్కే పనిచేస్తుంది. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం సుమారు 15 మంది నేతలకు నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ కలెక్టర్ హిమాన్షు శుక్లాకు లేఖ రాశారు. ఇది అప్రజాస్వామ్యకమని, ప్రజల గొంతు నొక్కడమేనన్నారు.

- సిపిఎం నేతలకు నోటీసులు
- కలెక్టర్‌కు మూలం రమేష్ లేఖ
- నేడు పబ్లిక్ హియిరింగ్

సిపిఎం నేతలకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రజల గొంతు వినిపించకుండా పోలీసులు నొక్కుతున్నారు. నేడు కిసాన్‌సెజ్‌లో జరిగే పిబ్లిక్ హియరింగ్‌కు సిపిఎం నేతలు హాజరుకాకుండా పోలీసులు నోటీసులు జారీ చేశారు. నేతల ఇళ్లవద్ద, కార్యాలయానికి వెళ్లి నోటీసులు ఇచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శివర్గ సభ్యులు కాయం శ్రీనివాసులు, నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, బత్తల కృష్ణయ్య, జిల్లా కమిటీ సభ్యులు ముత్యాల గురునాథం, బుచ్చి నాయకు పి.మల్లికార్జున, సిహెచ్ మల్లికార్జున, పొదలకూరు నాయకులు బి.మనోహర్, జిల్లా నాయకులు చంద్ర రాజగోపాల్, కొడవలూరు నాయకులు గోను దయాకర్, ఎస్‌డి మహబూబు బాషా, గుంజి వెంకట రమణయ్య, గుంజి శ్రీనివాసులు, నెల్లూరు రూరల్ నాయ కులు ఆలూరు తిరుపాలు, జనార్ధన్, దగదర్తి నాయకులు రమేష్, టిపి గూడూరు నాయ కులు రాజా, తదితరులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం సిపిఎం నేతల ఇళ్లకు, కార్యాల యానికి వెళ్లి నోటీసులు అందించారు. నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, బుచ్చి, దగదర్తి, టిపి గూడూరు, కొడవలూరు, పొదలకూరు, ప్రాంతాల్లో నోటీసులు జారీ చేశారు.

సిపిఎం ఖండన

ప్రజాభిప్రాయ సేకరణకు రావద్దంటూ నోటీసులు ఇవ్వడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ అభిప్రాయలు చెప్పుకోడానికి వీలు లేకుండా నోటీసులు జారీ చేయడం అప్రజాస్వామ్యకం అన్నారు. సోమవారం ఆయన కలెక్టర్ హిమాన్షు శుక్లాకు లేఖ రాశారు. కలెక్టర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాము ప్రజల అభిప్రాయాన్ని మాత్రం అక్కడ తెలియ జేస్తామన్నారు. ఇందుకు విరుద్దంగా నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. ఎక్కడైనా ప్రజలు తమ అభిప్రాయం చెప్పుకునే స్వేచ్ఛ ఉంటుందని దానిని ఆరించడం సరైనది కాదన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అరెస్ట్‌ను నిరసిస్తూ రెండో నగర పోలీస్టేషన్ ఎదుట ఆందోళన

పర్యావరణాన్ని దెబ్బతీసే ఇథనాల్ పరిశ్రమలతో ప్రజలకు నష్టం

కలెక్టరేట్ ఎదుట వామపక్షాల నిరసన

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

వాతావరణ కాలుష్యంతో ప్రజారోగ్యాన్ని. పర్యావరణాన్ని దెబ్బతీసే ఇథనాల్ పరిశ్రమలు మాకొద్దు.. అంటూ వరి సాగుబడి చేస్తున్న పచ్చటి పొలాలను బీడు భూములుగా మార్చి వేసి ఆహార సంక్షోభం సృష్టించే పరిశ్రమలు వద్దంటూ వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం రాచర్లపాడు ప్రాంతంలో మూడు ఇథనాల్ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మొగిలి వేంకటేశ్వర్లును కలిసిన నాయకులు, రైతులు వినతిపత్రం అందజేశారు. అనంతర సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మీడియాతో మాట్లాడారు. రాచర్లపాడు గ్రామం రైతుల నుంచి కిసాన్ సెజ్‌లో ఇఫ్కో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని భూములు ప్రభుత్వం సేకరించి స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికి 25 ఏళ్ళ పూర్తి కావస్తున్నా నేటికి పరిశ్రమల స్థాపనకు నోచుకోలేద న్నారు. అనేక సందర్భాల్లో ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపన చేయాలని, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని వామపక్ష పార్టీలు నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయని గుర్తు చేశారు. నేడు ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించి పర్యావరణాన్ని ఇథనాల్ పరిశ్రమలు స్థాపించేందుకు సిద్ధపడటం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్నారని, ఆ కార్యక్రమానికి ప్రజలు పాల్గొని తమ అభిప్రాయం తెలియజేవచ్చన్నారు. అయితే ఆకార్యక్రమానికి హాజరుకారాదంటూ పోలీసులు నోటీసులు అందజేయడం దుర్మార్గ మన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి మాట్లాడుతూ కిసాన్ సెజ్‌లో మూడు ఇథనాల్ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నేడు ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తుందని, వాస్తవానికి ఇథనాల్ పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తి ప్రారంభం అయితే వెలువడే విష వాయులవల కారణంగా ఆ ఫ్యాక్టరీలకు చుట్టు 10 కిలోమీటర్ల రేడియస్ పరిధిలో ప్రజలు తీవ్రమైన అనారోగ్యానికి గురిఅవుతారన్నారు.ఏ లక్ష్యం కోసం సెజ్ భుములను ప్రభుత్వం సేకరించిందో దానికి వ్యతిరేకంగా ఇటువంటి ఫ్యాక్టరీలు ప్రారంభించడం చట్టరీత్యా నేరమన్నారు.ప్రభుత్వ చర్యలను వామపక్షపార్టీలు, ప్రజాసంఘాలు వ్యతిరేకిస్తుంటే పోలీసులు నోటీసులు అందజేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని ప్రజలు తమ అభ్యంతరాలు తెలపుకునేందుకు వీల్లేదంటూ పోలీసులు నోటీసులు అందజేయడం దుర్మార్గపు చర్య అన్నారు. సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) జిల్లా నాయకులు సిహెచ్ సాగర్ తెలంగాణ, రాజస్థాన్ ప్రాంతాల్లో ప్రజలు వ్యతిరేకించిన ఇథనాల్ పరిశ్రమలను ఇక్కడ పెట్టాలనుకోవడం దారుణమన్నారు.దీన్ని ప్రజా ఉద్యమం ద్వారా అడ్డుకుం టామన్నారు. ఎస్‌యుసిఐ (సి) నాయకులు బసవరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అత్యంత వినాశకరమైన పరిశ్రమలను జిల్లాలో ఏర్పాటు చేయాలనుకోవడం సిగ్గుచేటన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, వ.కా.స జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, సిఐటియు జిల్లా నాయకులు గోను దయాకర్, మాబాషా, సిపిఎం ఎంఎల్ నాయకులు రాంబాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.దాయాకర్, అజీజ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, బిఎస్‌పి నాయకులు జానకీ ప్రసాద్, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

గుడ్లూరు :రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేసి రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు రైతులు అర్జీలు సమర్పించారు. పరిష్కరిస్తామని నితహశీల్దార్ బాలకిషోర్ అర్జీ దారులకు హామీ ఇచ్చారు.

హుండీల ఆదాయం లెక్కింపు

వలేటివారిపాలెం : మాలకొండ ఆలయంలోని 37 హుండీల ద్వారా 9 శనివా రాలకు సంబంధించి రూ. 61,38,761 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రక టనలో తెలిపారు. ఆ శాఖ పర్యవేక్షణ అధికారి సైదమ్మబాయి పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగిందన్నారు.

విఆర్ డిగ్రీ కళాశాలను పునఃప్రారంభించాలి: ఎస్‌ఎఫ్‌ఐ

నెల్లూరు విఆర్ డిగ్రీ కళాశాలను పున ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ నాయకులు జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లుకు కలెక్టరేట్‌లో జెసికి వినతి పత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర మాట్లాడారు. జిల్లా అధ్యక్షులు టి విక్రమ్, జిల్లా ఉపాధ్యక్షులు జి విష్ణు నాయకులు పవన్ పాల్గొన్నారు.

ప్రజల గొంతుక సిపిఎం..!

-పరిశ్రమలకు వ్యతిరేకం కాదు.. ప్రమాదకర పరిశ్రమలకే.. -ఎన్నో పోరాటాలకు నాయకత్వం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :నెల్లూరు జిల్లాలో జరిగిన అనేక ఉద్యమాల్లో ప్రజల గొంతుకగా సిపిఎం వినిపిం చింది.. ముత్తుకూరులో పివిసి, ఫ్యాక్టరీ, 33 వేల మెగావాల్ట్ థర్మల్ ప్రాజెక్టుల నిర్మాణం, క్రెబ్స్, ఇలా ప్రజల ప్రాణాలకు, ఆరోగ్యాలకు హాని చేసే పరిశ్రమల విషయంలో సిపిఎం ప్రజల తరపున పోరాటం చేసింది. నేడు కిసాన్‌సెజ్‌లో ఏర్పాటు కానున్న ఇథనాల్ పరిశ్రమల పబ్లిక్ హియిరింగ్‌లో ప్రజల తరపున తన వాదన వినిపించడానికి సిపిఎం సిద్ధ మైంది. థర్మల్ ప్రాజెక్టుల వల్ల గతంలో ముత్తుకూరు మండలంలోని నేలటూరు, పైనాపురం, టిపి గూడూరు లోని వరకాయపూడి ఇంకా అనేక గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకొని పంటలు పండక పశువులకు మేత లభించక నీరు పొల్యూట్ అయిపోయి నివసించలేని పరిస్థితుల్లో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఆనాడు ప్రభుత్వం పరిశ్రమ ఆధిపతులు ఇంటికో ఉద్యోగం, ఆస్పత్రులు. మంచినీరు, విద్య, వైద్యం పొల్యూషన్ లేకుండా చర్యలు అని చెప్పిన వాగ్దానాలు ఒక్కటీ పూర్తి చేయ లేదు. పంటలు పండక నీరు పొల్యూట్ అయిపోయి భూగర్భ జలాలు తగ్గి సవృద్ధిగా నీరు లభించే గ్రామాలలో ఇంటి ముందు డ్రమ్ములతో కిటికీలు తలుపులు తెరిస్తే దుమ్ము, ధూళి శబ్దాలు భరించలేక కిటికీలు మూసుకొని పంటలు, కూరగాయలు సరిగ్గా పండగ పశువులు మేత దెబ్బతిని వాగులు, వంకలు, చెరువులలో నీరు కలుషితమై చేపలు ఉత్పత్తి తగ్గి మేకలు, గొర్రెలు మేసేందుకు మేత కలుషితమైంది. ప్రజలు స్వగ్రామాన్ని వదులుకొని పోలేక అక్కడ నివసించలేక నరకయాతన పడుతున్నారు. ఆరోజు సిపిఎం, నేతలు చెప్పిన విషయాలు ఆ రోజు నిజమై ప్రజలు తెలుసుకున్నారు. సిపిఎం 2002లో జరిగిన విద్యుత్తు ఉద్యమంలోనూ 1979లో జరిగిన అఖిలపక్ష రైతు ఉద్యమంలోనూ ప్రముఖమైన పాత్ర వహించింది. అనేక ప్రజా ఉద్యమాలకు బాటలు వేసింది సిపిఎం.కరేడు భూ సమస్య, ఇండోసోల్ పొల్యుషన్, ఇలా అనేక పోరాటాల్లో సిపిఎం ముందుంది. ప్రజల గొంతుక వినిపించే నేతలకు నోటీసులు ఇవ్వడంపై ప్రజలు, ప్రజా సం ఘాలు నిరసన తెలుపుతున్నాయి. ప్రజాభిప్రాయం చెప్పడానికి అవకాశంకల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి.

'ఇంటూరి'ని కలిసిన నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు :టిడిపి నెల్లూరు పార్లమెంటరీ కమిటికి ఎంపికైన నాయకులు సోమవారం ఎంయల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావుని కలసి అభినందనలు తెలిపారు.పార్లమెంట్ ఉపాధ్యక్షులు వున్నం వీరాస్వామి,అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వహక కార్యదర్శి షేక్ మహబూబ్ బాషాలు ఎంయల్‌ఎని కలిశారు. టిడిపి కందుకూరు పట్టణాద్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-కందుకూరు

ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కర్యలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.రిటైర్డ్ ఉద్యోగి దర్జాగా విదులు నిర్వహించడం ఎంయల్‌ఎ ఇంటూరి కంటపడింది.ప్రవేటు వ్యక్తి ఇక్కడ ఎలాపనిచేస్తున్నడని ప్రశ్నించారు.

తైక్వాండో పోటీలలో కందుకూరు క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-కందుకూరు :ఈనెల 26 ,27, 28 తేదీల్లో విజయవాడలో జరిగిన 40వ జాతీయస్థాయి టైక్వాండో పోటీలు జరిగాయి. పోటీల్లో ఎపి తరపున కందుకూరు నుంచి 8 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో ఐదుగురికి బంగారు పతకాలు, రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకం గెలిచి ప్రభం జనం సష్టించారని కందు కూరు టైక్వాండో కోచ్ ఎండి హఫీజ్ తెలి పారు. వారిని టైక్వాండో ప్రెసిడెంట్ గ్రాండ్ మాస్టర్ బివి రమణయ్య, ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు , ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎండి జహంగీర్, పట్టణ ప్రముఖులు పిడికిటి వెంకటేశ్వర్లు,కోచ్ ఎండి హఫీస్ అభినందించారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు సరికాదు

తోటపల్లిగూడూరు :ఇథనాల్ ఫ్యాక్టరీ జనావాసాల ప్రాంతాల్లో పెట్టడం వల్ల ప్రజలకు హాని కలుగుతుందని, సిపిఎం తోటపల్లి గూడూరు మండల నాయకులు మారుబోయిన రాజా ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఇక్కడ మాట్లాడారు. కొడవలూరు మండలం రాచర్లపాడు వద్ద ఇఫ్కో సెజ్ నందు పెట్టబోతున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వద్దని రాజా తెలిపారు.

నెల్లూరు : కిసాన్ సెజ్ లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు కు ప్రభుత్వం అనుమతి ఇవ్వడానికి వ్యతిరేకంగా కలెక్టరేట్లో జిల్లా డిఆర్‌ఒకు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వినతి పత్రం అందజేశారు.

అనుమతులు ఇవ్వొద్దు..కొడవలూరు మండలం రాచర్లపాడు వద్ద ఇఫ్కో సెజ్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వద్దు అంటూ ఏపి వడ్డెర వ త్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌ని కలిసి వినత పత్రం అందజేశారు.గుంజి దయాకర్ ఇథనాల్ పరిశ్రమల వల్లజరిగే దుష్పరిణామాలను వివరించారు.

మహాసభల జయప్రదం కోరుతూ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-నెల్లూరు :విశాఖలో ఈనెల 31వ తేది నుంచి జనవరి 4వ తేదీ వరకు జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో శ్రేణులు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ బైక్ ర్యాలీ వైఎంసి ఎ గ్రౌండ్ నుంచి అయ్యప్ప గుడి సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు రూరల్ ఉపాధ్యక్షులు కొండా ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సిఐటియు రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం సుధాకర్, కెపెంచల నరసయ్య మాట్లాడారు.అబ్దుల్ అజీజ్ ,శివాజీ, ఖలీల్ ,మాల కొండయ్య, ఖాజావలి, కోటేశ్వరరావు,సురేష్ ,దేశ మూర్తి ,సునీల్ , శ్రీనివాస్ రెడ్డి, గిరి ,గంగరాజు పాల్గొన్నారు.



మౌలానా అంత్యక్రియలు

నెల్లూరు ప్రతినిధి :ప్రముఖ ఇస్లాం ప్రబోదకులు, ముస్లిం అధ్యాత్మికవేత్త, హజ్రత్ మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహబ్ సాహెబ్ ఖాసిమీ రషాది అంత్యక్రియులు ముగిశాయి. ఆదివారం రాత్రి ఆయన మృతిచెందారు. సోమవారం ఉదయం 11 గంటలకు బట్వాడిపాళెం వద్ద ఉన్న జామీయా మసీద్‌లో అంత్యక్రియులు నిర్వహించారు. జిల్లావ్యాపితంగా ముస్లిం పెద్దలు, పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన భౌతికకాయానికి వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నగర ఇన్‌ఛార్జ్ పి.చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించి నివాళి అర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు :ప్రజాశక్తి దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు తన క్యాంపు కార్యలయంలో సోమవారం ఆవిష్కరించారు. పట్టణ డిడిపి అద్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బి కృష్ణా రెడ్డి,టిడిపి నాయకులు వున్నం వీరాస్వామి, ప్రజాశక్తి విలేకరి నాదేళ్ల కోటేశ్వరరావు, డివిజన్ ఇన్‌ఛార్జి మహేశ్వరరావు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ 'ఇంటూరి'

హత్యలు..రౌడీయిజం..

2025 క్రైమ్ రివ్యూ ..

ప్రశాంతంగా ఉండే నెల్లూరులో అశాంతి రాజ్యమేలుతోంది... ఈ ఏడాది ఎటూ చూసినా హత్యలు, రౌడీయిజం, గంజాయి బ్యాచ్‌లు.. డ్రగ్స్, మాదకద్రవ్యాల బ్యాచ్‌లు నెల్లూరులో పోలీసుల పనితీరుకు సవాల్ విసిరారు. .నేరం జరిగిన క్షణాల్లో హంతకులను, రౌడీమూకలు, గుండాలను పట్టుకున్నా నేరం జరగకుండా చూడడంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు..ఈ ఏడాది జిల్లాను వణికించి విషయాల్లో సిపిఎం నాయకులు కె. పెంచలయ్యను అత్యంత కిరాతంగా హత్య ఒక్కటి. మాజీ మంత్రులపై కేసులు, వైసిపి నేత ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి,.అరవ కామాక్షి, కోవూరు నిడిగుంట అరుణ, చిన్న చిన్న విషయాలకు హత్యలు, షరా మాములే. ఇద్దరు ఎస్‌పిలు మారారు. కృష్ణకాంత్‌ను మార్పు చేసి, ప్రస్తుతం ఎస్‌పి అజితాను నియమించారు.. పోలీసులు మారుతున్నా హత్యలు, నేరాలు తగ్గడం లేదు. ఈ ఏడాది పోలీసులకు అగ్ని పరీక్షగానే సాగింది..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు నగరం రోజు రోజుకు అభివృద్ధి చెందుతోంది. అదే స్థాయిలో నేరాలు పెరుగు తున్నాయి... రాజకీయ నేతల ప్రోత్సాహంతో మరింతగా రెచ్చిపోతున్నారు. ఈ ఏడాది అంతా జిల్లాలో నేరాలు, ఘోరాలు సాగాయి.. కందుకూరులో ముగ్గురిని అత్యంత దారుణంగా హత్య చేశారు. నెల్లూరుకు చెందిన నలుగురు యువకులు సుఫారీ తీసుకొని ఒంగోలు టిడిపి నేతల హత్య చేశారు. సిపిఎం నేత కె. పెంచలయ్యను గంజాయి ముఠా అత్యంత దారుణంగా హత్య చేసింది. ఇది రాష్ట్రంలోనే చర్చినీయాంశమైంది. గంజాయి ముఠాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని చెబుతున్నా ఎక్కడా ఫలితం కనిపించడం లేదు. జిల్లాలో జనాభా పెరిగా అందుకు అనుగుణంగా స్టేషన్లు పెరగడం లేదు. ప్రజల సౌకర్యార్థం పోలీసు స్టేషన్లు పెరగాల్సి ఉంది. సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉంది. ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. విఐపి తాకిడి ఎక్కువకావడంతో ప్రజలకు సేవచేయడం కన్నా విఐపి సేవలోనే పోలీసులకు సరిపో తుంది. ప్రజల జీవన విధానంలో మార్పురావడం, నగరీకరణ పెరగడంతో పోలీసుల బాధ్యతలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నగరాల్లో ప్రజలకు అందుబాటులో, సౌకర్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో జిఒ నెంబర్ 48 విడుదల చేసింది. ఈ జిఒ ఆధారంగా పోలీసు స్టేషన్లు పరిధిలు మారాయి. నెల్లూరు నగరంలో పోలీసు స్టేషన్లు పరిధిలు తికమకగా ఉన్నాయి. నెల్లూరు నగరం ఇప్పుడు గంజాయి బ్యాచ్ చెలరేగిపోతున్నాయి. పదేళ్లుగా దొంగలు, రౌడీలు, గుండాలు, గంజాయి బ్యాచ్‌ల చేతుల్లో పెట్టారనే విమర్శలున్నాయి.. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా నేరస్తులకు భయం ఉండడం లేదు. . రాజకీయ నాయకులు ప్రోత్సాహంతోనే నెల్లూరు ఇలా తయారైంది. పోలీసు అధికారులు తమ పోస్టింగ్‌లు, ప్రమోషన్ల కోసం, మంచి స్టేషన్లలో ఉద్యోగాల కోసం అధికారపార్టీ నేతలకు ఊడిగం చేశారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. అందుకే పోలీసులంటే భయం లేకుండా పోయింది.. . ఇటీవల కాలంలో నగరంలో జరుగుతోన్న హత్యలు పరిస్థితికి అద్దం పడుతొంది. రూ500 ఇవ్వలేదని పెన్నా వద్ద ఇద్దరిని చంపి వాగులో పడేశారు..కేవలం రూ.40 వేల సుఫారీ కోసం ఒంగోలు వెళ్లి అధికారపార్టీ నేతను హత్యచేశారు.. బస్సు సైడ్ ఇవ్వలేదని డ్రైవర్, క్లీనర్‌ను కత్తితో పొడిచి గాయపరిచారు. తాజాగా కింద పడిపోయిన వ్యక్తులకు సాయం చేసినందుకు కత్తితో పొడిచారు.

గంజాయి మూకల చేతిలో హత్యకు గురైన పెంచలయ్య (ఫైల్)

పోలీసులకు సవాల్..!

నెల్లూరు నగరంలో ఈ ఏడాది నేరాలు పెరిగాయి. ఎస్‌పి కృష్ణకాంత్ కొంత మార్పు తీసుకురావాలని ప్రయత్నం చేశారు. ఆయనను బదిలీ చేశారు. ఎస్‌పి అజితా ఇక్కడకు వచ్చారు. ఆమె కొంత నిక్కస్సుగా ఉన్నప్పటికీ నేరాల సంఖ్య తగ్గడం లేదు. నేరుగా ప్రజలను కలుసుకొని శాంతిభద్రలను పర్యవేక్షిస్తున్నారు. నేరాలకు పాల్పడిన వారిని రోడ్లపై ఊరేగిస్తున్నారు. రౌడీ షీట్స్, పిడి యాక్ట్ పెడుతున్నారు. అనేక మంది జైల్లో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి పెట్టడంతో నేరస్తులపై నిఘా పెంచారు. పోలీసులు మరింత లోతుగా విచారణ జరిపి, నేరస్తులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. నేరం చేసిన కొద్ది గంటల్లోనే పట్టుకుంటున్నారు. జైలుకు పంపుతున్నారు. నేరాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. ఈ ఏడాదైనా నేరాలు తగ్గుముఖం పడుతాయో లేదో చూడాలి.

ఆటో కార్మికుల నిరసన

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: ప్రయివేటు బస్సుల యాజమాన్యాలు ఆటో కార్మికులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నాయంటూ ఇందుకూరుపేటలో ఆటో కార్మికులు తీవ్ర నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్.కె. చాంద్ బాషా ఆధ్వర్యంలో ఆటో కార్మికులు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించి, ప్రయివేటు బస్సుల యాజమాన్యాలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోలపై ఆధారపడి ఇందుకూరుపేటలో దాదాపు 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు.

ఇటీవల కాలంలో ఇందుకూరుపేట పరిధిలో అనధికారికంగా ఏడు ప్రయివేటు బస్సులు అధిక వేగంతో తిరుగుతూ ఆటోలకు అడ్డుగా నిలుస్తూ కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన ఆటో కార్మికులపై ప్రైవేటు బస్సుల ఉద్యోగులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. అంతేకాకుండా, ఆయా ప్రైవేటు బస్సులకు లైసెన్స్ లేని డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వహిస్తున్నారన్నారు. నిర్దిష్ట టైమ్ షెడ్యూల్ లేకుండా తమ ఇష్టానుసారం బస్సులు తిరుగుతున్నాయని విమర్శించారు. ఈ కారణంగా రోడ్డు భద్రతకు ముప్పు ఏర్పడడంతో పాటు ఆటో కార్మికుల ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేకంగా చొరవ తీసుకొని ఆటో కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ఆటో కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-కావలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 పథకంలో భాగంగా మహిళా సాధికారత కోసం సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో గత నెల 29 వ తేదీ నుంచి కొనసాగుతున్న ఉచిత కుట్టు శిక్షణ తరగతుల కొనసాగింపు కోసం మార్గదర్శకులు కె శ్రీనివాసరావు, కె సాయి చైతన్యలు నేడు 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడు తూ గత నెల 29న తేదీన కీర్తిశేషులు ఎన్ఎస్ లలిత, వారి కుమారుడు కీ శే సాయి రాం భావన్ జ్ఞాపకార్థంగా దాతలు కె శ్రీనివాసరావు, కె సాయి చైతన్యల సహకారంతో ఉచిత కుట్టు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణ మొదలు పెట్టి నెల పూర్తయిన సందర్భంగా కొన సాగింపు కోసం 10వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని నేడు కె శ్రీనివాసరావు, కె.సాయి చైతన్యలు అందజేశామని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి నెలా సంయుక్త సేవా సంస్థ ద్వారా పేదలకు అన్నదానం చేస్తూ ఉండేవారని తెలిపారు. ఈ సారి మహిళా సాధికారత కోసం కుట్టుశిక్షణ తరగతులను నిర్వహించడం కోసం ముందుకు వచ్చి సహాయాన్ని అందించడం గొప్ప విషయం అని తెలిపారు.

వ్యవసాయ రుణాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి-విడవలూరు: సొసైటీలో తీసుకున్న రైతు రుణాలు వెంటనే రద్దు చేయాలని సిపిఎం పార్టీ నాయకుడు, కౌలు రైతు సంఘం నాయకుడు తుళ్లూరు గోపాల్ ఆధ్వర్యంలో సోమవారం తాహిశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ చంద్రశేఖరుకు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా తుళ్లూరు గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో సొసైటీలో తీసుకున్న రుణాల మాఫీ చేయడం జరుగుతుందన్నారు. ఇంతవరకు అది అమలు చేయడం జరగలేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని

ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం కౌలు రైతుల సంఘం సిపిఎం ఆధ్వర్యంలో సొసైటీలో తీసుకున్న వ్యవసాయ రుణాలు రద్దు చేయాలని రైతు ని కాపాడండి అనేదానిపై ధర్నా చేశామన్నారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం మండల అధ్యక్షులు మడపర్తి అంకయ్య అధ్యక్షుగా ముఖ్య అతిథులుగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగ య్య పాల్గొన్నారు. నాయకులు మస్తానయ్య, బడుగు సుబ్బయ్య, కౌలు నాయకులు ఎస్కే ఖాదర్ మస్తాన్, కుడుముల మోహన్, ఏనేటి సుధాకర్, ఏనేటి రఘురామయ్య పాల్గొన్నారు.

రైతులతో గ్రామసభ.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం నాగులవరం రెవెన్యూ పరిధిలోని రైతులతో రీసర్వే పై తహశీల్దార్ సాన శ్రీనివాసులు రెడ్డి, బోగోలు పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగులవరం రెవెన్యూ పరిధిలో భూములను రీ సర్వే ప్రారంభం అవుతుందని తెలిపారు. రైతులకు సంబంధించిన పొలం తాలూకు డాక్యుమెంట్లను తీసుకొని పొలం వద్దకు వెళ్లి రీ సర్వేను చేయించుకోవాలని సూచించారు. అధికారులు రైతుల నుండి పొలాలకు సంబంధించిన కాగితాలను తీసుకొని వారి పేరు మాత్రమే నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వర రావు, నాగులవరం పిఎసిఎస్ సహకార సంఘం చైర్మన్ చిలకపాటి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బోగిరి ప్రభాకర్, జిల్లా నాయకులు నూకసాని శ్రీనివాసులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శాంతినికేతన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతసాగరం: మనోహర్ రెడ్డి మెమోరియల్ అపస్మా మెగా జిల్లా స్థాయిస్పోర్ట్స్ మీట్ లో శాంతినికేతన్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. సీనియర్ బాలికల విభాగంలో 100,200 మీటర్ల పరుగు పందెంలో ఎస్ కె మహీన్, ప్రథమ స్థానం,లాంగ్ జంప్ లో ఎల్ రాణి ప్రథమ,సీనియర్ బాలుర 100మీటర్ల పరుగు పందెంలో డీ కిరణ్ తృతీయ స్థానం, 400మీటర్ల పరుగు పందెంలో సి సీహెచ్ సాయి రామ్ తృతీయ, జూనియర్ బాలుర లాంగ్ జంప్‌లో డి.కృష్ణ ప్రథమ, షాట్ పుట్ లో ఎన్ నరసింహ తృతీయ, స్థానాలు సాధించారు. విజేతలకు అపస్మా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎన్ శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సి హెచ్ వి రమణారెడ్డి జిల్లా స్పోర్ట్స్ చైర్మన్ జి ప్రభాకర్ అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. శాంతినికేతన్ విద్యార్థులకు పిఇటి మల్లికార్జున్‌కు అభినం దనలు తెలియజేశారు.


రక్తదానం చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- కావలి.: ఎంఎస్ఆర్.డిగ్రీకళాశాల లో సోమవారం కీర్తిశేషులు మాగుంట సుబ్బరామరెడ్డి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ టి.ఉమ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కళాశాలలో సుబ్బారామి రెడ్డి జ్ఞాపకార్థం వారి వర్ధంతి రోజున రక్తదాన శిబిరం కావలి రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఈ సంవత్సరం వర్ధంతి రోజున తుపాన్ కారణంగా వాయిదా పడటంతో ఈ రోజు నిర్వహిస్తున్నామన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని కావలి రెడ్ క్రాస్ ట్రెజరర్ ఆరికట్ల మధుసూధన రావు, వైస్ చైర్మన్ కె. హరినారప రెడ్డి ప్రారంభించారు. రెడ్ క్రాస్ సిబ్బంది, రెడ్ క్రాస్ లైఫ్ నెంబర్ గడ్డం శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ టి ఉమ , వైస్ ప్రిన్సిపల్ కిరణ్ పాల్గొన్నారు. ఈ సందరేగా రక్తదానం చేసిన వారికి హెచ్‌డిఎఫ్ సిబ్యాంక్.వారు బహుమతులు అందించారు.

సీనియర్ కామ్రేడ్లకు సన్మానం

ప్రజాశక్తి-కావలి: ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం ఉద్యమ పోరాటం చేసిన సిపిఐ భారత గడ్డపై 100 సంవ త్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏఎ మున్సిపల్ వర్కర్స్ యూనియ న్(ఏఐటీయూసి) ఆధ్వర్యంలో సీనియర్ కామ్రేడ్స్ కావలి పట్టణంలో సిపిఐలో క్రియా శీలకంగా కీలక పాత్ర పోషించిన డాక్టర్ పి మారుతీ రావు, బిల్లా పురుషోత్తములకు సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జిలాని బాషా ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లాకార్యవర్గసభ్యులు పి మాలకొండయ్య, యూనియన్ గౌరవ అధ్యక్షులు మండ్ల వెంకటేశ్వర్లు, అధ్యక్షులు ఎండ్లూరి ఆదినారాయణ, కార్యదర్శి తన్నీరు వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మళ్లీ అంకయ్య, సిపిఐ కావలి నియోజకవర్గం సహాయ కార్యదర్శి దమ్ము దుర్గాబాబు, కమిటీ సభ్యులు ప్రభావతి గుంజి అంకయ్య, కార్మికులు పాల్గొన్నారు.

చెరువు కలుజు కాలువ ఆక్రమణను తొలగించాలి

ప్రజాశక్తి - కావలి.: కావలి మందాటి చెరువు కలుజు కాలువ ఆక్రమణల ను తక్షణ మేతొల గించాలని, అక్రమంగా నిర్మాణం అవుతు న్న సెల్ టవర్ ని కూడా తొలగించాలని వామపక్ష పార్టీలు సోమవారం కావలి ఆర్‌డిఒ ఎం. సన్నీ వంశీ కృష్ణ కు వినతిపత్రం ఇచ్చారు. ఆర్‌డిఒ సానుకూలంగా స్పందించి, తక్షణమే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఆక్రమణ తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీ నేతలు పసుపులేటి పెంచలయ్య (సిపిఎం), కరవది భాస్కర్ (అడ్వకేట్) కొప్పర్తి నాగరాజు (సిపిఐ), సిపిఎం నాయకులు కృష్ణ మాట్లాడు తూ.తక్షణమే మందాటి చెరువు కలుజు కాలువ ఆక్రమణలను తొలగించాల ని,అక్రమంగా నిర్మాణం చేస్తున్న సెల్ టవర్ ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు కలుజు కాలువ

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆక్రమణ లను మార్కింగ్ చేశారని మార్కింగ్ చేసిన మేరకు ఉన్న ఆక్రమణలను కట్టడా లను తొలగించాలని డిమాండ్ చేశారు. అంతేకాక ఆక్ర మించి కట్టడాలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను కోరారు. అధికారులే ఆక్రమణ గుర్తించిన పుడు వాటిని తొలగించడానికి ఎందుకు మీనమే షాలు లెక్కిస్తున్నారని అధికా రులను ప్రశ్నిం చారు. రాజకీయశక్తులకు లొంగకుండా అధికారులు చిత్తశుద్ధితో మందాటి చెరువు ఆక్రమణ తొలగించి చెరువులు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే మందాటి చెరువు ఆక్రమణలకు గురై చెరువు వాస్తవ విస్తీర్ణం కంటేపూర్తిగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు కలుజు కాలువలు కూడా పూర్తిగా ఆక్రమణకు గురైన స్థితిలో చెరువు నిండినప్పుడు వచ్చే నీటి ప్రవాహం అక్రమ కట్టడాల వలన వెనక్కు మళ్లీ లోతట్టు ప్రాంతాలు మునిగిపోవడం, భవిష్యత్తులో చెరువు కట్ట తెగి, చుట్టుపక్కల కాలనీలు ప్రాంతాలు మునకకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు.మందాటి చెరువు వలన కావలి పట్టణంలో సాగునీటికి తాగునీటికి భూగర్భ జలాలకు ఇబ్బంది లేకుండా ఉందని,అటువంటి చెరువులను కాపాడాల్సిన బాధ్యత రాజకీయనాయకుల పైన ప్రభుత్వ అధికారుల పైన ఉందన్నారు.మందాటి చెరువు ఆక్రమణలు తీవ్రమవుతున్న క్రమంలో భవిష్యత్ లో ప్రజలకు సాగునీటి తాగునీటి భూగర్భ జలాలకు తీవ్రమైన కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రవణలను అడ్డుకో లేకపోతే ఆక్రమణలను తొలగించకపోతే భవిష్యత్తు తరం చెరువులు కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.కనుక మందాటి చెరువు కలుజు కాలువ ఆక్రమణలను తక్షణమే తొలగించాలని లేనిపక్షంలో వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాయని తెలియజేశారు. అంతకుముందు వామపక్ష పార్టీ నేతలు ఆక్రమణకు గురైన మందాటి చెరువు కలుజు కాలువను అక్రమంగా నిర్మాణం అవుతున్న సెల్ టవర్ నిర్మాణాన్ని పరిశీలించారు

అంగన్‌వాడీలకు మొబైల్స్ పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంగన్ వాడీల బలోపేతానికి చర్యలు తీసుకుం టున్నారని, అందుకోసమే గతంలో అందచేసిన 4జీ మొబైళ్ల స్థానంలో 5జీ మొబైళ్లను అందచేస్తున్నట్లు ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి పేర్కొ న్నారు. ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరి ధిలో అంగన్‌వాడీలకు సీడీపీఓ సునీలత ఆధ్వర్యంలో నూతన 5జీ మొబైల్స్‌ను ఆయన సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో విధులు నిర్వహిస్తున్న అంగన్ వాడీలకు 5 జీ మొబైల్స్ అందజేశామన్నారు. ఆత్మకూరు క్లస్టర్ పరిధిలో ఆత్మకూరు 92, ఏఎస్ పేట 2, సంగం 52, చేజర్ల 59 మందికి అందజేసినట్లు వివరించారు. ప్రజలకు అందించే సేవలను మొబైల్ ద్వారా ఎప్పటికప్పుడు నమోదు చేయడంద్వారా మరింత పారదర్శకత పెరుగుతుందని భావిస్తున్నామని,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్యాస్ సిలెండర్లు, ఇతర మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జి. కస్తూరి, పద్మ, శ్రీదేవి, కె.మహాలక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అందజేస్తున్న దృశ్యం

‘గురుకులం’లో పరిశీలన

ప్రజాశక్తి-సంగం: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కో-ఆర్డినేటర్ ప్రభావతమ్మ సందర్శించి, పదో తరగతి విద్యార్థుల100 రోజుల కార్యక్రమాన్ని పరిశీలించారు. పాఠశాల వసతులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశాల మేరకు పదవ తరగతి విద్యార్థుల కోసం వంద రోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తు న్నట్లు తెలిపారు.జిల్లాలోని 8 గురుకుల పాఠశాలల్లో మొత్తం 640 మంది పదవ తరగతి విద్యార్థులు, 473 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉన్నారని వివరి ంచారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు అంకితభా వంతో పనిచేస్తున్నారని కొనియాడారు.ఈ ప్రత్యేక తరగతుల వల్ల విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెరిగిందని, వారిలో క్రమంగా అభివృద్ధి కనిపిస్తోందని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.సంగం గురుకుల పాఠశాల అభివ ద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు ప్రభావతమ్మ తెలిపారు.పాఠశాల చుట్టూ రక్షణ గోడ ఎత్తు పెంచడానికి ఇతర మైనర్, మేజర్ రిపేర్ల కోసం నిధులు కేటాయించినట్లు చెప్పారు. జిల్లా పరిధిలోని గురుకుల సంస్థల అభివృద్ధికి దాదాపు 1.32 కోట్ల రూపాయల పరిపాలనాపరమైన అను మతులు లభించాయని వెల్లడించారు. కార్య్ర కమంలో పాఠశాల ప్రిన్సిపల్ సుమతమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థులకు గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: స్థానిక ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆరుగురు విద్యార్థులకు గోల్డ్‌మెడల్ సాధించారు. అమీర్ ఆర్ట్స్ అకాడమీ వారు దేశవ్యాప్తంగా నిర్వహించిన పదవ ఆల్ ఇండియా చిల్డ్రన్స్ ఆర్ట్స్ కాంపిటీషన్ 2025 లో ఆరుగురు గోల్డ్ మెడల్ సాధించారు .ఆదివారం నెల్లూరులోని టౌన్ హాల్‌లో జరిగిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులు ఎస్ విజయ్, వి సాయి మహిత్, పి గాయత్రి, సిహెచ్ వైష్ణవి, ఎస్ డి జోయా ఫిర్దోజ్ ,జీవీ కిన్విత, అను విద్యార్థులు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ విజయాన్ని సాధించిన ఠాగూర్ స్కూల్ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం సిహెచ్ వి రమణా రెడ్డి, కే దొరస్వామి రెడ్డి ,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఇందిరమ్మ సేవలు మరువరానివి

ప్రజాశక్తి-కావలి.: పేదప్రజలకు వైద్య సేవలు అందించి వృత్తికే వన్నె తెచ్చిన డాక్టర్. చెన్నారెడ్డి ఇందిరమ్మ అని లోక్ అదాలత్ సభ్యులు ఎం. మాలకొండారెడ్డి,ప్రజావైద్యులు డాక్టర్. పి అంకిరెడ్డి లు పేర్కొన్నారు. డాక్టర్. ఇందిరమ్మ అకాల మృతి పేద ప్రజలకు తీరని లోటని, సోమవారం ముసునూరులోని వారి నివాసం లోని పార్థీవ దేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా

వారుమాట్లాడు తూ కర్నూల్ మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించి ప్రభుత్వ వైద్యురాలుగా వివిధ ప్రాంతాల్లో పనిచేసి పేదప్రజల మన్ననలు పొందారన్నారు. ఆమె రిటైర్డ్ అయిన తదుపరి కూడా పేదలకు వైద్య సేవలు అందిస్తూ (82) లో అకాల మరణం చెందడం బాధాకరం! అని ఆమె జీవితాంతం కావలి పరిసర ప్రాంతాల్లో వందలాది ఉచిత వైద్య శిబిరాల్లో పాల్గొని వైద్య సేవలు అందించి పేద ప్రజల మన్ననలనుపొందారన్నారు. సంతాపం వ్యక్తంచేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పెట్రోల్ కల్తీ ఆరోపణ అవాస్తవం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: వాహనాలకు నింపే పెట్రోలు కల్తీ చేస్తున్నారన్న ఆరోపణలు అవాస్తవమని, జిల్లా పెట్రోల్ డీలర్ల అసోసియేషన్ నాయకులు ఖండించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో సోమవారం విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్ మాట్లాడారు. గడచిన కొంత కాలంగా జిల్లాలో వర్షాలు భారీగా కురిసినట్లు గుర్తు చేశారు. వాతావరణం మార్పుల వలన, అండర్ గ్రౌండ్ ట్యాంకులలో నీరు పెట్రోలతో కలిసి ఉండవచ్చని తెలిపారు. అండర్ గ్రౌండ్ పైపుల జాయింట్ల వద్ద మరమ్మతులు ఉన్న వర్షపు నీరు లీకయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు ఏ.ప్రసాద్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జగన్నాథం, జితేంద్ర, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేత

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండలలోని పెద్దిరెడ్డిపల్లి పంచాయతీలో డోర్ టు డోర్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టిడిపి లాగిన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు శాసనసభ్యులు కాకర్ల సురేష్ సోమవారం వింజమూరులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో మండల టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జ్ నాదెళ్ల రాజా, 68వ బూత్ ఇన్‌ఛార్జ్ బత్తుల మాధవ, 69వ బూత్ ఇన్‌ఛార్జ్ నాదెళ్ల భాస్కర్‌లకు ప్రశంసాపత్రాలు

ప్రశంసాపత్రాలు చూపుతున్న దృశ్యం

అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన దగ్గర నుండి అభివృద్ధి సంక్షేమ పథకాలు పెద్దపీట వేసిందని, నియోజకవర్గంలో సుమారు 200 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, జెడ్‌పిటిసి రావెళ్ల నాగేంద్ర, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పోకా మహేష్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, సొసైటీ చైర్మన్ గుర్రం గోపి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు..

ప్రజాశక్తి-కావలి: మండలంలోని రైతులకు యూరియా సరిపోయినంత ఉందని, యూరియా కొరత లేదని బస్తా ఒకటి 300 రూపాయలకు డీలర్లు అమ్ముతున్నారని వ్యవసాయ శాఖ ఏడిఏ సి.హెచ్. నాగరాజు సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యూరియా సరిపోయినంత ఉందని, రైతులు డీలర్ షాపులలో సొసైటీలలో పిఎసిఎస్ కేంద్రాలలో రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఎరువులు కావాల్సిన రైతులు యూరియా కార్డులు చూపించి, తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కావలసినంత ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఏజెంట్లకు వర్క్‌షాప్

ప్రజాశక్తి-ఎఎస్‌పేట:

మండలంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాల యంలో మంగళవారం ఉదయం 10:30గంటలకు వర్క్ షాప్ నిర్వహిం చడం జరుగుతుందని, ఏపీ ఈడబ్ల్యూ ఐడీసీ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పత్రికా ముఖంగా తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ వర్క్ షాప్‌నకు తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్చార్జీలు, యూనిట్ ఇన్చా ర్జీలు, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు, బిఎల్ఒలు తప్పనిసరిగా హాజరు కావాలని తెలియజేశారు.

గుడిలో అభిషేకాలు

ప్రజాశక్తి-కోవూరు

:కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో వెలసి ఉన్న ఇష్ట కామేశ్వరి సమేత జలధార పరమేశ్వరి ఆలయంలో సోమవారం ఆధ్యా త్మిక శోభసంతరించుకుంది. పవిత్ర పెన్నానది తీరాన కొలువై ఉన్న స్వామివారికి విశేష అభి షేకాలు, పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ప్రముఖ వ్యాపార వేత్త జేఎల్ సత్యం వ్యవహ రించారు. కార్యక్రమంలో పెన్నానది స్విమ్మర్స్ పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చంద్రశేఖర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-కావలి.

:శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి ఆశీస్సు లతో నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన ఏగూరి చంద్రశేఖర్ సోమ వారం ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచిబాధ్యతలు అప్ప గించి నందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం నిబద్ధతతో పనిచే స్తా నని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే నాయకులకు సముచిత గుర్తింపు లభిస్తు ందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆశయా లను ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా ప్రతికార్యకర్త శ్రమించాలన్నారు.ఈ కార్య క్రమంలో పలువురుతెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిపిగా ఆనంగి రమణయ్య

ప్రజాశక్తి-వింజమూరు:

మండలం ఇన్‌ఛార్జి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుగా ఆనంగి రమణయ్యని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఇటీవల కాలంలో ఎంపీపీ గా ఉన్న ఈ మోహన్ రెడ్డిని తొలగించడంతో ఆ పదవి ఖాళీగా ఉన్నందువలన ఈ సమాచారాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి కలెక్టర్ పంపించారు. అందులో భాగంగానే మండలంలో వైస్ ఎంపీపీ గా ఉంటున్న ఆనంగి రమణయ్యను ఇన్చార్జి ఎంపీపీగా నియమించారు. అనంతరం రమణయ్య మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు సొసైటీ అధ్యక్షులు సల్లా వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎంపిటిసిలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. మండల పరిధిలోని అందరు ఎంపీటీసీలు సలహాలు పాటిస్తూ మండల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. మండలంలోని అన్ని అభివృద్ధి పనులను సమీక్షించి అందరికీ అందుబాటులో ఉండి అందరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు.కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు, గూడా నర్సారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

ప్రజాశక్తి-కోవూరు: పదవ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయాలు మీ సొంతం అవుతాయని ప్రదానోపాధ్యాయులు సోఫియా కిరణ్మయి అన్నారు. కోవూరులోని పిఆర్ఎస్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం పదవ తరగతి విద్యార్థులకు బీసీ సంక్షేమ వసతి గృహ సంక్షేమాధికారి సుమలత రెడ్డి బలవర్ధకమైన పౌష్టికాహారం తన సొంత నిధులతో అందించారు. ఈ సందర్భంగా సంక్షేమాధికారికి విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ వంద రోజుల ప్రణాళికను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలను ఈ ప్రణాళిక పూర్తయ్యేంత వరకు పాఠశాలలకు పంపేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

సిఆర్‌జెడ్‌లో ఆక్రమణలు తొలగించండి

ప్రజాశక్తి-ముత్తుకూరు: కృష్ణపట్నం సముద్ర తీర ప్రాంతాన కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో అక్రమ ఆక్వాగుంటలను తక్షణమే తొలగించాలని ఆగ్రామస్తులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లాస్థాయి అధికారులకు ప్రజా విజ్ఞప్తుల దినం కార్యక్రమంలో ఈ అంశం పైన వినతిపత్రం ఇచ్చా మని గ్రామస్తులు భవాని శంకర్, మరి కొంత మంది తెలియజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్రమణలు తొలగిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఎన్‌టివి రిపోర్టర్ మృతికి నివాళులు

ప్రజాశక్తి-కోవూరు: కోవూరు నియోజకవర్గ ఎన్‌టివి రిపోర్టర్ కె. రాజశేఖర్ సోమవారం తెల్ల వారు జామున గుండెపోటుతో మృతిచెందారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్రెడ్డి కోవూరులోని శ్రీరామ నగర్లోని ఆయన నివాసానికి వెళ్లి రాజశేఖర్ భౌతికకా యానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి వీరి చలపతిరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, శివుని నరసింహులురెడ్డి, తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన

ప్రజాశక్తి-కోవూరు : పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్ వాడీ కేంద్రాలపై తల్లులకు మరింత అవగాహన కల్పించేలా అంగన్వాడీ కార్యకర్తలు తగు చొరవ తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా అన్నారు. కోవూరులోని శాంతినగర్లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో సోమవారం సెక్టార్ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 10వ తేదీ లోగా చిన్నారుల బరువు, ఎత్తు తూచి ఆన్లైన్ యాప్లో నమోదు చేయాలన్నారు. ౦. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం:

వాసన్ఐ కేర్ సహకారంతో ఉచిత కంటి వైద్యం నిర్వహించామని కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలోని వవ్వేరు గ్రామంలో 19వ వార్డు కౌన్సిలర్ లలితా రెడ్డి, టిడిపి గ్రామ నాయకులు శ్రీకాంత్ రెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలోని వ ద్ధులు కంటి వైద్య పరీక్షల కోసం నెల్లూరుకి వెళ్లలేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

సంగంలో గ్రామ సభ

ప్రజాశక్తి-సంగం: గ్రామ సచివాలయంలో రీ సర్వే కార్యక్రమంపై గ్రామ సభను తహశీల్దార్ సోమ్లా నాయక్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు, ప్రభుత్వ చేపట్టిన రీ సర్వే లక్ష్యం విధానం గురించి పూర్తి వివరాలు వెల్లడించారు.గ్రామ సభ అనంతరం తహశీల్దార్ సోమ్లా నాయక్, టీడీపీ నాయకులు, రైతులు కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో సాగిన ఈ ర్యాలీలో రీ సర్వే ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ నినాదాలు చేశారు. భూమి హక్కుల స్పష్టత, భూవివాదాల పరిష్కారం, డిజిటల్ రికార్డుల సిద్ధీకరణకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆనం పర్యటనకు హాజరుకండి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: మండలంలో డిసెంబర్ 31వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణరెడ్డి ఎఎస్‌పేట గ్రామపంచాయతీలో సామాజిక పింఛన్ ఇతర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనుటకు విచ్చేయుచున్నారని, మండల పరిషత్ అభివృద్ధి అధికారిని పి. ప్రసన్న కుమారి పత్రికాముఖంగా తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ... ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు , ప్రాదేశిక నియోజక సభ్యులు, జెడ్‌పిటిసి సభ్యులు, పంచాయతీ సర్పంచులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని తెలియజేశారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-ముత్తుకూరు, :పంటపాలెం కేంద్రంగా కృష్ణపట్నం పోర్టు బైపాస్ రోడ్డు మార్గంలో ఉన్నటువంటి పామాయిల్ అసోసియేషన్ కార్యాలయం ఆదాయ వనరులుగా మారిందని రాష్ట్ర మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బ్రహ్మదేవి, కృష్ణపట్నం గ్రామాల్లో పర్యటించి ఆ పార్టీకి సంబంధించిన కొన్ని కుటుంబాలను పరామర్శి ంచారు. బ్రహ్మ దేవిలో ఆయన మీడియాతో మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గం లోని పరిశ్రమల ప్రాంతంలో దోపిడీ ఎక్కువైందన్నారు. బూడిద లారీల మొదలుకొని ఆయిల్ ఉత్పత్తి కర్మాగారాల అసోసియేషన్ వరకు ఇదే జరుగుతుందని ఆరోపణ చేశారు. తమ ప్రభుత్వం లోనే అభివృద్ధి జరిగిందని కూటమి ప్రభుత్వంలో ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మెట్ట విషు?వర్ధన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు దుంపల కాలువకు మోక్షం

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని ప్రధాన డ్రెయిన్ అయిన దుంపల కాలువకు గత దశాబ్ద కాలంగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సలహాలు, సూచనలతో సోమవారం ఈ కాలువ ఆక్రమణకు శ్రీకారం చుట్టారు. జేసీబీతో అక్రమ ణలు తొలగిస్తూ పనులు చేపట్టడం పట్ల కోవూరు ప్రజలు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మొత్తమ్మీద దుంపల కాలువ ఆక్రమణలను తొలగించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

ఆలయంలో వైకుంఠ ద్వారా దర్శనం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణ పరిధిలోని జెఆర్ పేటలో ఉన్న శ్రీ వెంకటేశ్వ రస్వామి ఆలయం వైకుంఠద్వారా దర్శనంకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ శాసనమండలి సభ్యులు, మాజీ జిల్లాపరిషత్ చైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, బాలాజీభక్తసమాజం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీన మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వారం ద్వారా ఉత్తరద్వార దర్శనం ఉంటుందని రాఘ వేంద్రరెడ్డి పేర్కొ న్నారు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు::గూడూరు
E.P.No. 63/2022
(Gajuvaka) O.S.No. 308/2019

అట్ల పద్మ ...D.Hr
వర్సెస్
పుచ్చకట్ల వెంకట వంశీ మల్లిఖార్జున ...J.Dr

పైన తెలిపిన కోర్టు నందు D.Hr తనకు రావసిన డిక్రీ వసూలు నిమిత్తం E.P. షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలంవేసి డిక్రీ బాకీ వసూలు చేయమని కోరుతూ E.P. దాఖలు చేసి యున్నారు. కావున ఈ క్రింది కనబరిచిన E.P. దాఖల షెడ్యూలు ఆస్తిని 11.02.2026 తేదీన పై కోర్టు నందు ఉదయం 10:30 నిమిషాలకు వేలం వేయుదురు. కావున ఆసక్తి గల పాటదారులు ఆ రోజు వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. ఇది కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయబడినది.

E.P. షెడ్యూలు ఆస్తి వివరములు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రస్తుతం తిరుపతి జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ గూడూరు మండలం విందూరు గ్రామ పంచాయతీ మరియు గ్రామం సర్వే నెం. 485 విస్తీర్ణం 1-00 (ఒక ఎకరా) ఎకరా మెట్టభూమి దానికి హద్దులు **తూర్పు:** అట్ల రాఘయ్య భూమి, **దక్షిణం:** భీమవరం మస్తానమ్మ భూమి, **పడమర:** గోర్తల శ్రీనివాసులు భూమి, **ఉత్తరం:** గోర్తల శ్రీనివాసులు భూమి
D.Hr Value: 26,00,000/-
Amina Value: 27,00,000/-
Upset Price: Rs.5,00,000/-

ఇట్లు
D.Hr తరఫున న్యాయవాదులు
కందనూరు వెంకట కృష్ణయ్య,
కందనూరు నితిన్ సాయిక్రిష్ణ
అడ్వకేట్స్ గూడూరు.

డాక్యుమెంట్ పోయినది
బెల్లంకొండ సరోజినమ్మ, భర్త శ్రీనివాసులు, అన్నవరం గ్రామం, జలదంకి మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. అను నాకు చెందిన **డాక్యుమెంటు నెం.727/2004 రు** సేల్ డీడ్, ఎస్ఆర్ఓ, కావలి. **ఒరిజినల్ రిజిష్టర్డ్ డాక్యుమెంట్ తే10-12-2025 ది** న కావలిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టౌన్ బ్రాంచ్‌కు పోవుచుండగా జారి కిందపడిపోయినది. దొరికిన వారు నాకు చేర్చగలరు.
ఇట్లు
బి.సరోజినమ్మ
సెల్: 85004 37112